



# క్షమాపణలు మాత్రమే చెప్పగలను: దర్శకుడు మణిరత్నం

: తన దర్శకత్వంలో వచ్చిన 'థగ్ లైఫ్' ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయిందన్నారు దర్శకుడు మణిరత్నం (ఈ విషయంలో ఆడియన్స్‌కు క్షమాపణలు చెప్పారు. ప్రేక్షకులు మరో క్లాసిక్‌ను ఆశించారని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో 'థగ్ లైఫ్' ఫలితంపై స్పందించారు.

''మా ఇద్దరి నుంచి మరో 'నాయకుడు'ను ఆశించిన వారికి నేను చెప్పగలిగేది ఒక్కటే. మమ్మల్ని క్షమించండి. ఆ సినిమా కంటే తక్కువ దాన్ని చేయడం మా ఉద్దేశం కాదు. అలాంటి ఆలోచన మాకెప్పుడూ లేదు. అలా ఎలా చేయాలనుకుంటాం. వేం పూర్తిగా భిన్నమైనదాన్ని అందించాలనుకున్నాం. ఎక్కువ అంచనా వేయడంతో మేం అనుకోని ఫలితాన్ని అందుకున్నాం. వేము అందించిన దానికంటే ఆడియన్స్ భిన్నంగా కోరుకున్నారని అర్థం చేసుకున్నా'' అని మణిరత్నం అన్నారు. ప్రస్తుతం ఆయన తన తర్వాత సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఒక పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌తో వచ్చేందుకు సిద్ధమయ్యారు. దీనికి సంబంధించిన పనులు కూడా ప్రారంభించారు.

కమల్ హాసన్ ( – మణిరత్నం ఈ కాంబినేషన్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'నాయకుడు' అప్పట్లో సంచలనం సృష్టించింది. దాదాపు 37 ఏళ్ల తర్వాత వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన చిత్రమే 'థగ్ లైఫ్'. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. జూన్ 5న విడుదలైన ఈ సినిమా వాటిని అందుకోవడంలో విఫలమైంది.

# సర్దార్‌జీ 3'లో పాక్ నటి.. విమర్శలు వెల్లువెత్తడంతో నిర్మాతల కీలక నిర్ణయం



దిల్జిత్ దొసాంజే () కథానాయకుడిగా నటిస్తున్న 'సర్దార్‌జీ 3' చిక్కుల్లో పడింది. జూన్ 27న ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటిస్తూ ట్రైలర్ విడుదల చేశారు. దిల్జిత్ సరసన పాక్ నటి హనియా ఆమిర్ నటించడంతో సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అవి సద్దుమణిగాయి. అయితే, పాక్ నటులు భారతీయు సినిమాల్లో అవకాశం ఇవ్వకూడదంటూ సినీ వర్గాలు నిర్ణయించిన సంగతి తెలిందే. ఈ క్రమంలో దిల్జిత్ తన కొత్త సినిమాలో హనియా ఆమిర్ నటించిన విషయం తెలిసిందే. దీని విడుదల తేదీని ప్రకటించడంతో ఒక్కసారిగా విమర్శలు వెల్లువెత్తాయి.

తాజాగా విడుదల చేసిన ప్రచార చిత్రం ప్రకారం చూస్తే 'సర్దార్‌జీ3'ని ఓ హారర్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. దిల్జిత్, హనియాలు యూకేలోని ఓ మ్యాన్షన్‌లో ఉన్న దెయ్యాలను ఎలా ఎదుర్కొన్నారు? వాటి ఆట ఎలా కట్టించారన్న ఇతివృత్తంగా సినిమాను తెరకెక్కించినట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్టిస్ట్‌లపై భారత్‌లో నిషేధం ఉన్న క్రమంలో హనియా ఆమిర్ 'సర్దార్‌జీ 3'లో నటించడంపై పలువురు నెటిజన్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ క్రమంలో ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) అధ్యక్షుడు బి.ఎన్. తివారి స్పందించారు. దిల్జిత్, చిత్ర నిర్మాతలపై నిషేధం విధించేలా మార్గనిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రకటనను విడుదల చేస్తామని, వారు చేసే సినిమాలేవీ భారత్‌లో విడుదల కాకుండా నిషేధం విధిస్తామన్నారు. ఇందుకు చిత్ర పరిశ్రమ పూర్తి సహకారం ఉంటుందన్నారు.

తాజా విమర్శలపై నిర్మాత గన్బిర్ సింగ్ సిద్ధు కూడా స్పందించారు. భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకముందే ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని తెలిపారు. భారతీయుల మనోభావాలను దృష్టిపెట్టుకుని ఈ సినిమాను ఇక్కడ విడుదల చేయటం లేదని తెలిపారు. నిర్మాత స్పందించిన కొద్దిసేపటికే సామాజిక మాధ్యమాల నుంచి ట్రైలర్‌ను తొలగించారు. మొత్తం ఈ వ్యవహారంపై నటుడు దిల్జిత్ స్పందించాడు. 'దేశాలు యుద్ధ వాతావరణంలో ఉండవచ్చు. అయితే, మనకు ఈ విషయాలపై నియంత్రణ ఉండదు. సంగీతం అన్ని దేశాలను ఒక్కటి చేస్తుందని మాత్రం నేను నమ్ముతాను. దేశాలు దాటి ప్రేమను పంచడంలో నేను భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉంది. దేశాలకు, సరిహద్దులకు అతీతంగా మాతృభూమిని చూడాలి'' అని అన్నారు.



# 'కుబేర'కు అదే తొలి విజయం.. శేఖర్ కమ్ములను చూస్తుంటే గర్వంగా ఉంది: చిరంజీవి

హైదరాబాద్: 'కుబేర' కు ప్రేక్షకాదరణ దక్కిన సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ )ను ఆదివారం నిర్వహించింది. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధనుష్ నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన ఈ సినిమా ఈ నెల 20న విడుదలైన సంగతి తెలిసిందే. వేడుకనుద్దేశించి చిరంజీవి మాట్లాడుతూ.. ''ఇది నా సక్సెస్ మీట్‌లా అనిపిస్తోంది. చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ ఉన్నవారంతా నాకు పరిచయం ఉన్నవారే. విభిన్న పాత్ర పోషించానంటూ నాగార్జున గతంలోనే నాకు 'కుబేర' గురించి చెప్పాడు. ధనుష్ హీరో అని తెలిపాడు. తనకు ఎలాంటి విజయాన్ని అయితే అందిస్తుందని చెప్పాడో.. ఇప్పుడు అది అందుకున్నాడు. ఎవరైనా హీరోగానే నటిస్తానని అనుకోవడం కరెక్ట్ కాదు. ఈ కథలో నాగార్జునను శేఖర్ ఊహించుకోవడం, అందుకు నాగ్ అంగీకరించడమే ఈ సినిమాకి తొలి విజయం అనుకుంటున్నా.ఓ సన్నివేశంలో బెగ్గర్ పాత్రలో ఉన్న ధనుష్‌ని నేను గుర్తించలేకపోయా. అంతగా ఆ పాత్రలో లీనమయ్యాడు. వాస్తవ సంఘటనలను చూస్తున్నట్టు అనిపించింది గానీ సినిమాలాగా అనిపించలేదు. శేఖర్ కమ్ముల తెరకెక్కించింది పది సినిమాలే అయినా.. ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నాడు. దర్శకుడిగా 25 ఏళు పూర్తయిన సందర్భంగా ఇటీవల నన్ను కలిశాడు. ఓ సినిమా చిత్రీకరణలో నన్ను తొలిసారిగా చూశానంటూ నాటి జ్ఞాపకాలు గుర్తుచేశాడు. అప్పుడు అక్కడున్న వారిలో అతడే ఎత్తుగా ఉన్నాడు కాబట్టి నేను పిలిచి ఉంటా. దర్శకుడిని కావాలని అతడు ఆ రోజే నిర్ణయించుకోవడం నాకు గర్వంగా ఉంది. అతడి సినిమాలన్నీ వాస్తవానికి దగ్గరగా ఉంటాయి'' అని పేర్కొన్నారు.

చిరంజీవి లక్కీ ఛార్మ్: శేఖర్ కమ్ముల

''చిరంజీవి నా లక్కీ ఛార్మ్ అయిపోయారు. వేడుకకు వచ్చినందుకు థాంక్స్ సర్. కాలేజీ రోజుల్లో మిమ్మల్ని కలిశా. అప్పుడు మీరిచ్చిన షేక్‌హ్యాండ్ ఇప్పటికీ గుర్తుంది. ఎప్పటికైనా మీతో సినిమా తీయాలన్న కల ఉందని ఇటీవల మిమ్మల్ని కలిసినప్పుడు చెప్పా. మీరు నాకెంతో క్లోజ్ అనిపిస్తుంటుంది'' అని శేఖర్ చెప్పారు. ''ఇలాంటి విభిన్న కాన్సెప్టును ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారోనన్న సందేహం ఉండేది. కానీ, ఫస్ట్ డే ఫస్ట్ షోతో నా అనుమానాలన్నీ తొలగిపోయాయి. ప్రేక్షకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ రుణం తీర్చుకోలేనిది. మీ ఆదరణే ఇలాంటి ఎన్నో చిత్రాలు తెరకెక్కించేందుకు ధైర్యాన్ని ఇస్తుంది. ఎప్పుడూ సపోర్ట్ చేసే మీడియాకు థాంక్స్

ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్‌ను ఎందుకు ఎంపిక చేశారోనని చాలామంది అనుకున్నారు. ఆయనతో కలిసి వర్క్ చేయాలని అందరికీ ఉంటుంది. మేం గతంలోనే కలిసి పని చేయాల్సి ఉంది. ప్రతి సన్నివేశాన్ని ఒకే సమయంలో తెలుగు, తమిళ్‌లో షూట్ చేశాం. 'కుర్రాడు బాగా నటించాడు' అని నాగార్జునపై మా అమ్మ ప్రశంసలు కురిపించింది. ధనుష్ నటననూ మెచ్చుకుంది. అందరూ సినిమా నిడివి ఎక్కువ అయిందని అంటున్నారు. మా అమ్మ మాత్రం 'మరో 10 నిమిషాలు ఉంటే బాగుండేది' అని చెప్పింది.

'కుబేర' విషయంలో నో డౌట్స్: రష్మిక

''నా సినీ జీవితంలో చిరంజీవి భాగమయ్యారు (ఆమె నటించిన పలు సినిమాల వేడుకలకు రావడాన్ని ఉద్దేశిస్తూ). ఏదైనా చిత్రాన్ని అంగీకరించే ముందు చాలా సందేహాలు ఉంటాయి. కానీ, 'కుబేర' విషయంలో అలాంటిదేం లేదు. దర్శకుడు ఎలా చెబితే అలా సమీర పాత్ర పోషించా. ఇలాంటి రోల్ నాకు దక్కినందుకు నాకే ఆశ్చర్యంగా ఉంది. నటిగా నన్ను మరో మెట్టు ఎక్కించిన చిత్రమిది. శేఖర్, నాగార్జున, ధనుష్, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్.. ఈ సినిమాకి మూల స్తంభాల్లాంటి వారు'' అని రష్మిక ప్రశంసించారు.

# నవ్విస్తూనే.. ఏడిపిస్తుంది.. ఆమిర్ సినిమాపై మహేశ్ ప్రశంసలు






ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'సితారే జమీన్ పర్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా అందరి హృదయాలను కదిలించేస్తోంది. ఇప్పటికే నెట్టింట ప్రశంసలు అందుకున్న ఈ సినిమాకు మహేశ్ బాబు కూడా ఫిదా అయ్యారు. ఎక్స్ వేదికగా దీనిపై పోస్ట్ పెట్టారు. ''అద్భుతమైన సినిమా. ఆమిర్ ఖాన్ ఇతర క్లాసిక్ సినిమాల్లాగానే 'సితారే జమీన్ పర్' కూడా మిమ్మల్ని నవ్విస్తుంది, ఏడిపిస్తుంది, చప్పట్లు కొట్టేలా చేస్తుంది. 'సితారే జమీన్ పర్' చూశాక కచ్చితంగా చిరునవ్వుతో బయటకు వస్తారు'' అంటూ చిత్రబృందాన్ని అభినందించారు.

ఈనెల 20న ప్రేక్షకుల ముందుకువచ్చిన 'సితారే జమీన్ పర్' సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరి మనసులను దోచుకుంటోంది. విడుదలకు ముందు ఏర్పాటుచేసిన ప్రత్యేక ప్రదర్శనల్లోనే పలువురు ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, బాలీవుడ్ హీరో షారుక్‌ఖాన్, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి దీనిపై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా సమాజంలో మార్పు తీసుకురాగలదని అభిప్రాయం వ్యక్తంచేశారు. మానసిక దివ్యాంగులను ఎవరూ తక్కువ చేసి చూడకూడదనే సందేశాత్మక చిత్రమిదన్నారు.

'తారే జమీన్ పర్'కు సీక్వెల్‌గా వచ్చిన చిత్రమిది . మానసికంగా సవాళ్లు ఎదుర్కొంటున్న వాళ్లకు ఓ కోచ్ బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చి, వాళ్లను మేటి ఆటగాళ్లగా తీర్చిదిద్దే ఇతివృత్తంగా రూపొందింది. ఆమిర్‌ఖాన్ ఇందులో కోచ్‌గా కనిపించి సినీప్రియులను ఆకట్టుకుంటున్నారు.

# తెరవెనక ప్రపంచమే ఇష్టం



మాస్ పాటతో మురిపించేందుకు సిద్ధం అంటోంది మాళవిక మోహనన్ (. ఈ మాట ఇతర కథానాయికలు చెప్పడం వేరు, మాళవిక చెప్పడం వేరు. సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకునే ఫొటోలు కుర్రకారుని ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. మోడలింగ్ రంగం నుంచి వచ్చిన ఈమె ఫ్యాషన్‌కి కేరాఫ్‌గా నిలుస్తోంది. ఘాటు ఘాటుగా ఫొటోలకి పోజులిస్తూ ఊరిస్తుంటుంది. అలాంటి మాళవిక మాస్ పాటలో కనిపిస్తానంటే కుర్రకారు ఆత్రుతగా ఎదురు చూడకుండా ఉంటారా? ప్రభాస్‌తో ) కలిసి నటిస్తున్న 'రాజాసాబ్' సినిమాలోనే మాస్ పాటతో సందడి చేస్తానని ఇటీవల చెప్పిందీమె. అన్నట్టు ఈమెకి తెలుగులో ఇదే తొలి చిత్రం. అందంతో కట్టిపడేస్తున్న ఈమె అనుకోకుండానే కెమెరా ముందుకొచ్చిందట. తెరముందు కనిపించడం కంటే, నాకు తెరవెనక ప్రపంచమే ఇష్టమని... అన్నీ అనుకున్నట్టు జరిగి ఉంటే తాను దర్శకురాలినో లేదంటే ఛాయాగ్రాహకురాలినో అయ్యేదాన్నని చెబుతోంది. ఓ దశలో ఎడిటింగ్ విభాగంలోకి వెళ్లాలని కూడా అనుకుందట. ఈమె తండ్రి కె.యు.మోహనన్ ప్రముఖ ఛాయాగ్రాహకుడు. తండ్రి అడుగు జాడల్లో నడవాలనుకున్న మాళవికని, ఆమె అందమే కెమెరా ముందుకు తీసుకొచ్చింది.

